## 50 లక్షలు ఇవ్వాలంటూ కేంద్రమంత్రికి బెదిరింపులు

న్యూఢిల్లీ: రూ.50 లక్షలు చెల్లించాలంటూ రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ మొబైల్ ఫోన్‌కు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి శనివారం సందేశం రావటం కలకలం రేపింది. మూడు రోజుల్లో డబ్బులు పంపకపోతే..తీవ్ర పరిణామాలుంటాయని కొందరు ఆయనపై బెదిరింపులకు పాల్పడ్డారు. తన మొబైల్‌కు బెదిరింపులు రావటం నిజమేనని, దీనిపై ఢిల్లీ పోలీసులు దర్యాప్తు చేపట్టారని సంజయ్ సేథ్ మీడియాకు తెలిపారు. రాంచీలోని కాంకే నుంచి ఈ బెదిరింపు సందేశం వచ్చినట్టు పోలీసులు గుర్తించారు. మరోవైపు ప్రధాని మోదీని అంతమొందించేందుకు ఇద్దరు ఐఎస్ఐ ఉగ్రవాదులు బాంబు దాడికి పాల్పడుతున్నారంటూ శనివారం ముంబై ట్రాఫిక్ పోలీసుల హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఓ సందేశం వచ్చింది. రాజస్థాన్‌లోని అజ్మీర్ నుంచి ఈ బెదిరింపు వచ్చిందని పోలీసులు చెప్పారు.

## 'పుష్ప' బాటలో ఆలుగడ్డల స్మగ్లింగ్

### పశ్చిమ బెంగాల్‌లో ఘటన

కోల్‌కతా: అక్రమార్కులకు ఐడియాలు బోలెడు. 'పుష్ప' సినిమాలో పాల క్యానుల్లో ఎర్ర చందనం దుంగలను స్మగ్లింగ్ చేసినట్లు చూపించారు. పశ్చిమ బెంగాల్ అక్రమార్కులు కూడా సినిమా చిట్కాలను అనుసరిస్తున్నారు. బంగాళ దుంపలను పశువుల మేత ముసుగులో ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఆలుగడ్డల ధరలు పెరిగిపోతుండటంతో ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేయడాన్ని ప్రభుత్వం నిషేధించింది. ఈ నిషేధాన్ని పట్టించుకోకుండా వ్యాపారులు రకరకాల పన్నాగాలతో వాటిని ఎగుమతి చేస్తున్నారు. డుబుర్‌దిహి చెక్ పోస్ట్ వద్ద పశువుల మేతతో వెళ్తున్న ఓ లారీని పోలీసులు తనిఖీ చేయగా లారీలో బంగాళ దుంపలు కనిపించాయి.

## కువైట్ బ్యాంక్‌కు 700 కోట్లు ఎగ్గొట్టారు

### 1,425 మంది మలయాళీలపై కేసు

న్యూఢిల్లీ: కువైట్ ఆరోగ్య శాఖలో పనిచేసిన కేరళ నర్సులపై తీవ్ర ఆరోపణలు వెలువడ్డాయి. వాళ్లు కువైట్‌కు చెందిన 'గల్ఫ్ బ్యాంక్' నుంచి దాదాపు రూ.700 కోట్ల రుణం తీసుకొని ఉడాయించినట్టు కేరళలో ఫిర్యాదు నమోదైంది. 1,425 మంది మలయాళీలు 2020 నుంచి 2022 మధ్య కాలంలో గల్ఫ్ బ్యాంక్ నుంచి పెద్ద మొత్తంలో రుణాలు తీసుకొని ఆ దేశాన్ని వీడారు. ఈ నేపథ్యంలో బ్యాంకు డిప్యూటీ మేనేజర్ కేరళకు చేరుకొని ఆ రాష్ట్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## వీలైనంత త్వరగా సిరియాను వీడండి

### భారత పౌరులకు విదేశాంగ శాఖ సూచన

న్యూఢిల్లీ: సిరియాలోని ప్రధాన నగరాలను తిరుగుబాటుదారులు ఆధీనంలోకి తీసుకుంటున్న నేపథ్యంలో భారత పౌరులు వీలైనంత త్వరగా ఆ దేశాన్ని వీడాలని భారత విదేశాంగ శాఖ అడ్వైజరీ జారీ చేసింది. 'సిరియాలో పరిస్థితుల నేపథ్యంలో తదుపరి ప్రకటన జారీ చేసే వరకు భారత పౌరులు ఆ దేశానికి ప్రయాణాలు పెట్టుకోవద్దు. ప్రస్తుతం అక్కడ ఉన్న వారు అందుబాటులో ఉన్న వాణిజ్య విమానాల ద్వారా వీలైనంత త్వరగా సిరియాను వదిలిరండి' అని శుక్రవారం రాత్రి విదేశాంగ శాఖ ఒక అడ్వైజరీ జారీ చేసింది.

## పార్క్‌రైడ్‌లో మృతికి పరిహారంగా 2,612 కోట్లు

### అమెరికాలోని ఆరెంజ్ కౌంటీ ఆదేశం


ఫ్లోరిడా: ఐకాన్ పార్క్‌లోని ఓర్లాండో ఫ్రీ ఫాల్ రైడ్‌లో మరణించిన టైర్ శాంప్సన్ తల్లిదండ్రులకు రూ.2,612 కోట్లు నష్ట పరిహారంగా చెల్లించాలని ఆరెంజ్ కౌంటీ జ్యూరీ గురువారం ఆదేశించింది. టైర్ తల్లిదండ్రులు నెకియా డాడ్, యమెల్ శాంప్సన్‌లకు ఈ భారీ పరిహారంలో చెరి సగం ఇవ్వాలని ఈ రైడ్ మాన్యుఫ్యాక్చరర్ ఫన్‌టైమ్‌కు జ్యూరీ తెలిపింది. టైర్ 2022 మార్చి 24న రైడ్ చేశాడు. సీట్ బెల్ట్ సరైనది కాకపోవడంతో 70 అడుగుల ఎత్తు నుంచి పడి, ప్రాణాలు విడిచాడు. ఫన్‌టైమ్ కంపెనీ ఆస్ట్రియాకు చెందినది. కాబట్టి, ఆరెంజ్ కౌంటీ జ్యూరీ ఆదేశాల అమలు కోసం నెకియా, యమెల్ ఆస్ట్రియా కోర్టును ఆశ్రయించాల్సి ఉంటుంది.

అప్పగింత 'అంత' ఆలస్యమా?

# 6% వడ్డీ కట్టండి

### ఫ్లాట్ ఒప్పందం ఉల్లంఘించిన బిల్డర్‌పై ఎన్‌సీడీఆర్‌సీ ఆగ్రహం

- కొనుగోలుదారు, బిల్డర్ మరణించినా కొనసాగిన పరిహారం కేసు
- కొనుగోలుదారు కుమారుడికి వెంటనే పరిహారం ఇవ్వాలని ఆదేశం




ముంబై: కొనుగోలుదారుకు ఫ్లాట్‌ను స్వాధీనం చేయడంలో తీవ్ర ఆలస్యం చేసిన బిల్డర్‌కు జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (ఎన్‌సీడీఆర్‌సీ) గట్టిగా బుద్ధి చెప్పింది. ఫ్లాట్ నిర్మాణం పూర్తి కాకముందే కొనుగోలుదారు నుంచి తీసుకున్న సొమ్ముపై వడ్డీ పరిహారం చెల్లించాలని ఆదేశించింది. వివరాల్లోకి వెళితే, మహారాష్ట్రలోని పన్వెల్‌లో ఫ్లాట్ కొనుగోలుదారుతో బిల్డర్ 2011 జూలైలో అమ్మకపు ఒప్పందం చేసుకున్నారు. దాని ప్రకారం ఫ్లాట్ విలువ రూ.64,56,768గా నిర్ణయించుకున్నారు. ఒప్పంద సమయంలో కొనుగోలుదారు నుంచి బిల్డర్ రూ.62,63,060 స్వీకరించారు. ఫ్లాట్‌ను 2013 మార్చిలో కొనుగోలుదారుకు స్వాధీనం చేస్తానని బిల్డర్ హామీ ఇచ్చారు. మిగిలిన సొమ్మును ఫ్లాట్‌ను స్వాధీనం చేసే సమయంలో చెల్లించేందుకు ఇద్దరి మధ్య అంగీకారం కుదిరింది. కానీ బిల్డర్ రకరకాల కారణాలు చెప్తూ ఫ్లాట్ నిర్మాణాన్ని పూర్తి చేయలేదు. గడువు లోగా ఫ్లాట్‌ను స్వాధీనం చేయకపోవడంతో కొనుగోలుదారు మహారాష్ట్ర రాష్ట్ర వినియోగదారుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో బిల్డర్ చివరికి 2019 ఫిబ్రవరిలో నిర్మాణం పూర్తి చేసి, ఫ్లాట్‌ను కొనుగోలుదారుకు ఇచ్చారు. అయితే ఆ సమయానికి కొనుగోలుదారు మరణించారు.

అయితే కొనుగోలుదారు కొడుకు తండ్రి తరపున కమిషన్‌లో వాదనలు కొనసాగించారు. ఈ కేసులో బిల్డర్ వాదనలు వినిపిస్తూ, తాను ఫ్లాట్ కొనుగోలుదారుకు పవర్ ఆఫ్ అటార్నీ రాశానని, ఆయన కుమారునికి కాదని వాదించారు. ఈ వాదనలను రాష్ట్ర కమిషన్ తోసిపుచ్చింది. కొనుగోలుదారు నుంచి తీసుకున్న సొమ్ముపై సంవత్సరానికి 20 శాతం వడ్డీని ఆయన కుమారునికి చెల్లించాలని ఆదేశించింది. అదే విధంగా, ఖర్చుల కింద రూ.25 వేలు, మానసిక వేదనకు పరిహారంగా రూ.1 లక్ష చెల్లించాలని తీర్పు చెప్పింది. ఫ్లాట్‌ను రెండు నెలల్లోగా అప్పగించాలని ఆదేశించింది. అయితే ఈలోగా బిల్డర్ కూడా మరణించడంతో ఈ కేసుపై ఆయన కుమారుడు జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్(ఎన్‌సీడీఆర్‌సీ)లో అప్పీల్ చేశారు. ఫ్లాట్ కొనుగోలుదారు ఎన్‌ఆర్‌ఐ అని, ఆయనకు భారత దేశంలో ఫ్లాట్‌ను కొనే అధికారం లేదని వాదించారు. ప్రస్తుత మార్కెట్ పరిస్థితులను బట్టి సంవత్సరానికి 20 శాతం వడ్డీ అంటే చాలా ఎక్కువ అని తెలిపారు. దీనిపై ఎన్‌సీడీఆర్‌సీ 2024 నవంబరు 6న తీర్పు చెప్తూ, ఎన్‌ఆర్‌ఐలు స్వదేశంలో ఇళ్లను కొనవచ్చునని చెప్పింది. ఫ్లాట్ నిర్మాణంలో ఆలస్యానికి బిల్డర్ చెప్తున్న కారణాలు పస లేనివని చెప్పింది. ఫ్లాట్ స్వాధీనానికి హామీ ఇచ్చిన తేదీ నుంచి ఫ్లాట్‌ను వాస్తవంగా స్వాధీనం చేసిన తేదీ వరకు కొనుగోలుదారు చెల్లించిన సొమ్ముపై సంవత్సరానికి 6 శాతం చొప్పున వడ్డీ చెల్లించాలని ఆదేశించింది. ఈ వడ్డీని 8 వారాల్లోగా చెల్లించాలని, ఆ విధంగా చెల్లించడంలో విఫలమైతే, ఆ తర్వాత సంవత్సరానికి 9 శాతం వడ్డీ రేటుతో చెల్లించాలని స్పష్టం చేసింది. ఖర్చుల కింద రూ.20 వేలు చెల్లించాలని చెప్పింది. అయితే మానసిక వేదనకు పరిహారంగా రూ.1 లక్ష, ఖర్చుల కింద రూ.25 వేలు చెల్లించాలని రాష్ట్ర కమిషన్ ఇచ్చిన ఆదేశాలను రద్దు చేసింది.

## భారతీయ విద్యార్థిని హత్య చేసిన రూమ్‌మేట్

### కెనడాలోని సార్నియా నగరంలో ఘటన

న్యూఢిల్లీ, డిసెంబర్ 7: కెనడాలో తన రూమ్‌మేట్ చేతిలో ఓ భారతీయ విద్యార్థి దారుణ హత్యకు గురయ్యాడు. లంబ్టన్ కాలేజ్‌లో బిజినెస్ మేనేజ్‌మెంట్ మొదటి సంవత్సరం చదువుతున్న గురాసిస్ సింగ్(22)ను క్రాస్‌లే హంటర్(36) అనే వ్యక్తి కత్తితో పొడిచి హతమార్చాడు. వీరిద్దరూ సార్నియా నగరంలోని క్వీన్ స్ట్రీట్‌లో ఒకే ఇంట్లోనే నివాసం ఉంటున్నారు. ఈ నెల 1న కిచెన్‌లో ఉండగా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన హంటర్.. గురాసిస్‌ను కత్తితో విచక్షణారహితంగా పొడిచాడు. దీంతో ఘటనా స్థలంలోనే గురాసిస్ కన్నుమూశాడు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్టు సార్నియా పోలీసులు తెలిపారు.




# 'ఇండియా' కూటమికి బీటలు!

- పార్టీల మధ్య మొదలైన అసమ్మతి రాగం
- కాంగ్రెస్ వ్యవహార శైలిపై అసంతృప్తి
- నాయకత్వ మార్పుపై ప్రారంభమైన చర్చ
- మమతా బెనర్జీకి ప్రధాన పార్టీల మద్దతు



న్యూఢిల్లీ, డిసెంబర్ 7: కేంద్రంలో బీజేపీని అధికారం నుంచి దించేయాలన్న ప్రధాన లక్ష్యంతో సుమారు 24 విపక్ష పార్టీలతో ఏర్పడిన ఇండియా కూటమి బీటలు వారుతున్నది. ఇప్పటికే కూటమిలో ఉన్న విభేదాలు లోక్‌సభ ఎన్నికల్లో ప్రస్ఫుటం కాగా, ఇటీవల జరిగిన పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తర్వాత కూటమికి నేతృత్వం వహిస్తున్న రాహుల్ గాంధీ పట్ల అందులోని పార్టీలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. 'ఎన్నికల్లో విజయం సాధించి పెట్టలేని నాయకుడిని మనం ఇంకా ఎంతకాలం భరించాలి' అన్న ధోరణి ఆ పార్టీల్లో ఇటీవల అధికమైంది. ముఖ్యంగా శివసేన (యూబీటీ), టీఎంసీ, సమాజ్‌వాదీ పార్టీలు శనివారం మమత చేసిన ప్రకటనపై స్పందించాయి. పరోక్షంగా ఆమెకు మద్దతు తెలిపి, కూటమిలో నాయకత్వ మార్పు చేపట్టాలన్న సంకేతాలు ఇచ్చాయి. దానికి తోడు ఇటీవల జరిగిన మహారాష్ట్ర, హర్యానా ఎన్నికల్లో కూటమి పరాజయం, ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ఒకే అంశం(అదానీ అవినీతి)పై కాంగ్రెస్ కేంద్రాన్ని నిలదీయడం, అధికార పార్టీ సభను వాయిదా వేయడం తదితర అంశాలు కూటమిలోని మిగతా పార్టీలకు ఏమాత్రం రుచించడం లేదు. దీంతో కూటమికి నేతృత్వం వహిస్తున్న రాహుల్‌ను తప్పించాలని కొన్ని ప్రధాన పార్టీలు భావిస్తున్నాయి.

**అవకాశమిస్తే సాఫీగా నడిపిస్తా: మమత**

శుక్రవారం మీడియాతో మాట్లాడిన బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కూటమి నాయకత్వం, సమన్వయం తీరు పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. 'నేను ఇండియా కూటమిని ఏర్పాటు చేశాను. నాకు అవకాశమిస్తే దానిని సాఫీగా నడిపిస్తా. అయితే నేను బెంగాల్‌ను వదిలి బయటకు రావాలనుకోవడం లేదు. ఇక్కడ నుంచే కూటమిని నడపగలను' అని ఆమె చెప్పారు.

**మమత ప్రధాన భాగస్వామి కావాలి: శివసేన (యూబీటీ)**

మమత సుముఖతపై శివసేన (యూబీటీ) స్పందించింది. 'మమత అభిప్రాయం తెలుసుకున్నాం. కూటమిలో ఆమె కూడా ప్రధాన భాగస్వామి కావాలనుకుంటున్నాం. . ఈ విషయంలో త్వరలోనే మమతా బెనర్జీతో కోల్‌కతాలో చర్చలు జరుపుతాం' అని ఆ పార్టీ ఎంపీ ప్రియాంక చతుర్వేది అన్నారు. 'దేశ్ బచావో.. బీజేపీ హఠావో' అన్నది మన ఉమ్మడి సంకల్పం. అయితే ప్రతి రాష్ట్రంలో పరిస్థితి ఒకేలా లేదన్నది ముఖ్యమైన విషయం' అని సీపీఎం నేత డీ రాజా తెలిపారు. రాహుల్‌గాంధీపై కూటమిలోని నేతలకు నమ్మకం లేదన్న విషయం మమత ప్రకటనతో వెల్లడైందని బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ బండారి పేర్కొన్నారు.సమాజ్‌వాది పార్టీ నేత ఉదయ్‌వీర్ సింగ్ మమతకు మద్దతు తెలిపారు. మమతా వ్యాఖ్యలపై కూటమిలోకాంగ్రెస్ ఆచితూచి స్పందించింది 'మమత ఎలాంటి వ్యాఖ్యలు చేసినా దానిపై అందరూ కూర్చుని చర్చించి నిర్ణయించుకోవాలి' అని కాంగ్రెస్ నేత టీఎస్ సింగ్దోయో అన్నారు. మమత ప్రతిపాదనను కాంగ్రెస్ నేత మాణిక్కం ఠాగూర్ జోక్‌గా కొట్టి పారేశారు.

### ఎంవీఏ నుంచి వైదొలగిన సమాజ్‌వాదీ

ఎంవీఏ నుంచి బయటకు రావాలని నిర్ణయించుకున్నట్లు సమాజ్‌వాదీ పార్టీ శనివారం ప్రకటించింది. శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రేకు సన్నిహితుడు మిలింద్ నార్వేకర్ బాబ్రీ కూల్చివేతపై ఇచ్చిన పోస్ట్ దీనికి కారణమని వివరించింది. మసీదును కూల్చివేసి 32 సంవత్సరాలు కాగా, గా మిలింద్ చేసిన పోస్ట్‌లో, మసీదు ఫొటో పెట్టి, శివసేన వ్యవస్థాపకుడు బాలా సాహెబ్ ఠాక్రే వ్యాఖ్యలను జత చేశారు. దీంతో మహారాష్ట్ర ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారాన్ని ఎంవీఏ బహిష్కరించగా, ఇద్దరు ఎస్పీ ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేశారు.






## అధికార పంపిణీ ఒప్పందం లేదు

### మాట మార్చిన డీకే శివకుమార్

బెంగళూరు, డిసెంబర్ 7: అధికార పంపిణీ ఒప్పందంపై కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట మార్చారు. అలాంటి ఒప్పందం ఏదీ లేదని, దీని గురించి ఎవరూ మాట్లాడొద్దని శనివారం పేర్కొన్నారు. ఎన్నికల ముందే అధికార పంపిణీపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు, తనకు మధ్య ఒప్పందం ఉందని ఇటీవల ఓ చానల్‌తో డీకే శివకుమార్ వ్యాఖ్యానించారు. ఇది కర్ణాటక కాంగ్రెస్‌లో చిచ్చు పెట్టింది. ఇలాంటి ఒప్పందం ఏదీ లేదని, అధిష్ఠానం నిర్ణయాన్నే తాను పాటిస్తానని సిద్ధరామయ్య కుండబద్దలు కొట్టారు. ఈ నేపథ్యంలో డీకే శివకుమార్ వెనకడుగు వేశారు. 'అధికార పంపిణీ ఒప్పందం గురించి ఎవరూ మాట్లాడొద్దు. ఇలాంటి ఫార్ములా ఏదీ లేదు. ఒక అవగాహనతో మేమిద్దరం పని చేస్తున్నాం. ఇదే విషయాన్ని నేను టీవీ చానల్‌కు చెప్పాను' అని డీకే శివకుమార్ పేర్కొన్నారు.

చవకైన దీర్ఘకాల రుణాలపై

# రైతుల పట్టు

### కేంద్ర మంత్రి నిర్మలతో ప్రీ బడ్జెట్ సమావేశం

పలు డిమాండ్లు ముందుంచిన రైతు సంఘాలు



న్యూఢిల్లీ: చవకైన దీర్ఘకాల రుణాలను అందించాలని, తక్కువ పన్నులు అమలు చేయాలని, పీఎం కిసాన్ ఆదాయ మద్దతును రెట్టింపు చేయాలని రైతు సంఘాల ప్రతినిధులు, వ్యవసాయ రంగ స్టాక్‌హోల్డర్లు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో శనివారం జరిగిన ముందస్తు బడ్జెట్ సమావేశంలో వారు ఈ డిమాండ్ చేశారు. దాదాపు రెండు గంటలపాటు జరిగిన సమావేశంలో పలు సవాళ్లపై సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా ఆర్థిక ఉపశమనం, మార్కెట్ సంస్కరణలు, వ్యూహాత్మక పెట్టుబడులపై చర్చ జరిగింది. వ్యవసాయ ఉత్పాదకత, రైతు సంక్షేమాన్ని పెంచేందుకు లక్ష్య జోక్యాల ఆవశ్యకతను భారత్ క్రిషక్ సమాజ్ చైర్మన్ అజయ్ విర్ జాఖర్ నొక్కి చెప్పారు. అలాగే, వ్యవసాయ రుణాలపై వడ్డీ రేట్లను ఒక శాతానికి తగ్గించడం, వార్షిక పీఎం కిసాన్ వాయిదాను రూ.6 వేల నుంచి రూ. 12 వేలకు పెంచడం వంటి ప్రాథమిక డిమాండ్లతోపాటు పీఎం ఫసల్ బీమా యోజన కింద చిన్న రైతులకు జీరో ప్రీమియం పంట బీమా కోసం కూడా రైతు ప్రతినిధులు వాదించారు. పురుగు మందులపై జీఎస్టీని 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించాలని పీహెచ్‌డీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ కోరింది. జాతీయ వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించేందుకు కొమ్ము శనగలు, సోయాబీన్స్, ఆవాలు వంటి నిర్దిష్ట పంటలపై దృష్టిసారించడంతోపాటు 8 ఏండ్లపాటు ఏడాదికి రూ.1000 కోట్ల పెట్టుబడి వ్యూహాన్ని జాఖర్ ప్రతిపాదించారు.

**చర్చలకు కేంద్రం నిరాసక్తత!**

తమ డిమాండ్లపై చర్చించేందుకు కేంద్రం నుంచి తమకు ఎటువంటి సందేశం రాలేదని, 101 మంది రైతులతో కూడిన ప్రతినిధి బృందం డిసెంబర్ 8న(ఆదివారం) ఢిల్లీకి బయల్దేరుతుందని పంజాబ్ రైతు నాయకుడు స్వరణ్ సింగ్ పంధేర్‌తెలిపారు.

## పిట్రోడా ఫోన్, ల్యాప్‌టాప్ హ్యాక్

### కొన్ని వేల డాలర్లు డిమాండ్

న్యూఢిల్లీ, డిసెంబర్ 7: విదేశాల్లో కాంగ్రెస్ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్న శ్యామ్ పిట్రోడా హ్యాకర్ల బారిన పడ్డారు. తన స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్, కంప్యూటర్ సర్వర్ హ్యాకింగ్‌కు గురయ్యాయని శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. క్రిప్టో కరెన్సీ రూపంలో వేలాది డాలర్లు ఇవ్వకుంటే తన పరువు, ప్రతిష్టలకు భంగం కలిగిస్తామని హ్యాకర్లు బెదిరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తన మెయిల్ లేదా మొబైల్ నుంచి ఏదైనా మెయిల్, మెసేజ్ వస్తే దానిపై క్లిక్ చేయవద్దని, అటాచ్‌మెంట్ ఉంటే డౌన్‌లోడ్ చేయవద్దని ఆయన కోరారు. చికాగోకు చేరుకున్న వెంటనే భద్రతా సమస్యలను పరిష్కరించి, సెక్యూరిటీ ప్రొటోకాల్‌ను మెరుగు పరుస్తానని తెలిపారు.

## భారత వ్యతిరేక ఎజెండా లేదు

### బీజేపీ ఆరోపణలను ఖండించిన అమెరికా

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోదీ, వ్యాపారవేత్త అదానీలపై లక్షిత దాడుల ద్వారా భారత్‌ను అస్థిరపరిచే ప్రయత్నాల వెనుక అమెరికా విదేశాంగ శాఖ నిధులు సమకూర్చిన సంస్థలు, డీప్‌స్టేట్‌లు ఉన్నాయంటూ బీజేపీ చేసిన ఆరోపణలను అమెరికా శనివారం ఖండించింది. భారత్ చేసిన వ్యాఖ్యలు తమను నిరాశ పరిచాయని, మీడియాకు స్వేచ్ఛ ఇవ్వడంలో ప్రపంచంలోనే అమెరికా చాంపియన్ అని అమెరికా దౌత్యకార్యాలయ ప్రతినిధి మీడియాకు తెలిపారు. తమపై భారత్ ఇలాంటి ఆరోపణలు చేయడం నిరాశ పరిచిందని, భారత్ వ్యతిరేక ఎజెండా ఏదీ తమ వద్ద లేదని పేర్కొన్నారు.



## డిసెంబర్ 21న ప్రపంచ ధ్యాన దినోత్సవం

### తీర్మానించిన ఐరాస

న్యూఢిల్లీ: డిసెంబర్ 21ని ప్రపంచ ధ్యాన దినోత్సవంగా ఐక్య రాజ్య సమితి ప్రకటించింది. భారత్, లిషెన్‌స్టీన్, శ్రీలంక, నేపాల్, మెక్సికో, అండొర్రా తదితర దేశాల చొరవతో ఐరాస సాధారణ సభ ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించింది. ఐరాసలో భారత దేశ శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ ఎక్స్ పోస్ట్‌లో ఈ వివరాలను తెలిపారు. సమగ్ర సంక్షేమం, అంతరాత్మ పరివర్తనల కోసం డిసెంబర్ 21ని ప్రపంచ ధ్యాన దినంగా నిర్వహించాలని ఐరాస నిర్ణయించిందన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21న నిర్వహిస్తున్నామని, అప్పటి నుంచి సరిగ్గా ఆరు నెలల తర్వాత ప్రపంచ ధ్యాన దినోత్సవం వస్తున్నదని వివరించారు.

## బంగ్లాలో ఇస్కాన్ ఆలయానికి నిప్పు!

### మంటల్లో కాలిపోయిన విగ్రహాలు




కోల్‌కతా: బంగ్లాదేశ్‌లోని ఢాకా జిల్లాలో ఉన్న తమ కేంద్రం ఆలయాన్ని శనివారం తెల్లవారుజామున ముష్కరులు దగ్ధం చేసినట్లు ఇస్కాన్ ఆరోపించింది. తమ సంస్థ సభ్యుల పైన, హిందూ మతస్తుల పైన బంగ్లాదేశ్‌లో దాడులు నిర్నిరోధంగా కొనసాగుతున్నాయని ఇస్కాన్ కోల్‌కతా ఉపాధ్యక్షుడు రాధారమణ్ దాస్ తెలిపారు. ధౌర్ గ్రామంలో హరే కృష్ణ నంహట్ట సంఘం నిర్వహిస్తున్న శ్రీ రాధాకృష్ణ ఆలయం, శ్రీ మహా భాగ్య లక్ష్మీనారాయణ ఆలయంలోని విగ్రహాలను ముష్కరులు తగలబెట్టారని ఆయన తెలిపారు. ఆలయం వెనుక భాగంలో పై కప్పును తొలగించిన దుండగులు పెట్రోల్ పోసి నిప్పు పెట్టారని, ఈ ఘటనలో ఆలయంలోని విగ్రహాలతోపాటు ఇతర వస్తువులన్నీ కాలి బూడిదై పోయాయని ఆయన తెలిపారు. తమ సభ్యులపై జరుగుతున్న దాడుల గురించి బంగ్లాదేశ్‌లోని ఆపద్ధర్మ ప్రభుత్వానికి తమ ఆందోళనను తెలియచేసినప్పటికీ అక్కడి పోలీసులు, పాలకుల నుంచి తగినంత స్పందన రావడం లేదని రమణ దాస్ ఆవేదన వ్యక్తం చేశారు.

**బంగ్లా దాడులపై అమెరికాలో నేడు నిరసన ర్యాలీ**

బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా అమెరికాలో శాంతియుత ర్యాలీలు నిర్వహించాలని పలు హిందూ సంఘాలు నిర్ణయించాయి. ఆదివారం చికాగోలో 'జాతి విధ్వంసం ఆపండి: బంగ్లాదేశ్‌లో హిందువుల ప్రాణాలు కాపాడండి' పేరుతో హిందువులు ర్యాలీ నిర్వహించనున్నారు. సోమవారం వాషింగ్టన్‌లోని వైట్ హౌస్ వద్ద మరో ర్యాలీ నిర్వహించనున్నట్టు హిందూ యాక్షన్ అనే సంస్థ ప్రకటించింది.

